### సి.పి.బ్రౌన్ అకాడమీ నవ్యవీక్లీ ఉగాది కథలపోటీలో విశేష బహుమతి రూ. 2,000 పొందిన కథ



‘‘చయనులూ నేన్నీకేమవుతా?’’

చయనులు, తలొంచుకున్నాడు సమాధానం చెప్పలేక, చెప్పడం ఇష్టం లేక.

గవండ్ల దుర్గమ్మ కాళీమాతలా నిలబడితే – ఆమె నోటికి, రూపానికి అందరూ తలొంచుకోవాల్సిందే ఆ అగ్రహారంలో.

‘‘సర్లే – చయనులూ – నే అడిగిందానికి ఏం చెయ్యదల్చుకున్నావో ఆలోచించుకొని చెప్పు’’.

దుర్గమ్మ వచ్చినంత వేగంగా వెళ్ళిపోయింది.

★★★

అగ్రహారంలో చయనలు సంపన్నుడే. కాస్తో, కూస్తో, సంస్కృతం, తెలుగు చదువుకున్నవాడే. అయితే ఆ చదువు ఉద్యోగానికి అక్కరకు రాక పోయినా ఊళ్ళేలటానికి పనికొచ్చింది.

వయస్సులో ఉండగా, కొన్నాళ్లు నాటకాల కంపెనీలతో తిరిగాడు. వాళ్లతో ఊళ్లు తిరిగాడు. సంగీతం అబ్బలా! కనుక వేషాలూదక్కలా! హార్మనీ పెట్టె మోయడం – తెరలు లాగటం అబ్బింది. ఎప్పుడన్నా, హరిశ్చంద్ర – కాటిసీనుల్లో – శవంలా పడుకోవడం, లేదా ‘చిత్తం మహారాజా’ అనటం మినహా ఇంకేం ముందుకు సాగలా. కాకపోతే, కొందరు నటీమణులతో సన్నిహిత సాంగత్యం అబ్బింది. పేకాట ఆడటం క్షుణ్ణంగా వచ్చేసింది.

కొడుకు, ఊళ్లవెంట, సానిపాపలతో తిరుగుతున్నాడని తెల్సి, తండ్రి, మేనమామ బలవంతాన పట్టుకొచ్చి పెళ్ళిచేశారు. అలాగైనా కొంప వదలకుండా ఉంటాడని, వాళ్ళ ఆశ నెరవేరింది. ఊళ్లోనే పేకాట, ఊరిబయట తోపులో అప్పుడప్పుడూ కోడి పందాలు, అవీ కాదనుకుంటే సైకిలేసుకుని దగ్గర్లో వున్న టౌనుకెళ్లి సినిమా చూసి, ఏ అర్ధ రాత్రో, అపరాత్రో కొంపకు చేరడం దినచర్య అయి కూర్చున్నది.

చయనులు తండ్రి – విశ్వేశ్వరశాస్త్రి దిగులుపడ్డాడు. కొడుకు ఇలా భ్రష్టుడయ్యాడే అని – కానీ ఏం చెయ్యాలో, ఏం చేస్తే, దారికొస్తాడో ఆయనకు తోచలా. ఆయనకు లోకజ్ఞానం తక్కువ. పైగా లేకలేక చాలా ఏళ్ళకు పుట్టిన కొడుకు. చయినులు అంటే వల్లమాలిన ప్రేమ వాత్సల్యం.

అసలు పుట్టినప్పుడే సమస్యలు వెంట పెట్టుకొచ్చాడు. అతడిని కన్న తరువాత భార్య సంవత్సరం పాటు మంచం దిగలేదు. తిరిగి మనిషిని చేయటానికి వేలకు వేలు ఖర్చు పెట్టించాడు. అంత డబ్బుపోయినా అదృష్టం బాగుండి ఆమె బ్రతికి బట్టగట్టింది.

కోడలు – మేనకోడలు – గాయిత్రిని అడిగి, పరిష్కారం కనుగొందామని ప్రయత్నించాడు. గాయిత్రి ఆ రోజుల్లో మిడిల్‌క్లాస్ పాసయింది. పుట్టింది పల్లెటూరయినా – కథలు, నవలలు, పురాణాలు, కాశీమజిలీ కథలూ చదివి లోకాన్ని అర్థం చేసుకున్నది.

‘‘మామయ్యా! మీకు కొడుకుని ప్రేమించడం తప్ప, పెంచడం తెలియదు. ఒక్కడే కొడుకు, ఒక్కడే కొడుకు అనిచెప్పుకుంటూ గారాబం

చేశారు. చదువబ్బలేదు. డబ్బు అడిగిందే తడవు ఇచ్చారు. వ్యసనాలు అలవడ్డాయి. పెళ్ళిచేస్తే కుదురుకుంటాడని భావించారు. సానులను మరిగినవాడికి, సంసారితో సౌఖ్యం రుచించదు. అంతా ఖర్మ, పూర్వజన్మ పాపం అంటూ దేవుడిమీద భారంవేసి, చేతులు కట్టుకు వరండాలో కూర్చుంటే మీ ప్రతిష్ట, పూర్వీకుల ఆస్తి, అన్నీ ఖరారావుడీ అవుతాయి!'' అని చెప్పింది గాయిత్రి నిర్మొహమాటంగా.

# నిగమాగమం

## ఎన్. తారక రామారావు

కోడలు చెప్పినవన్నీ నిజమే – కానీ ఎలా సరిదిద్దుకోవాలో విశ్వేశ్వర శాస్త్రికి అర్థంగాలా. ఆయన భార్య శాంతమ్మకు వంటిల్లు, తులసికోట, భర్త అవసరాలు చూడటం తప్ప మరో సంగతి తెలియదు – ఎవరిని అడగాలి?

ఈలోగా చయనులు తన అవసరాలకు ఊళ్లో అప్పులు చేయడం, ఇంట్లో వాళ్ళకు తెలియకుండా వస్తువులు కుదువపెట్టడం మొదలు పెట్టాడు.

విశ్వేశ్వరశాస్త్రి నిస్సహాయుడు – భార్య ఆయన నీడ!

ఒకరోజు గాయిత్రి నడుం బిగించి భర్తను నిలదీసింది.''మీరిల్లా ఇల్లు, ఇల్లాలు పట్టకుండా తిరిగితే ఎలా? ఏదన్నా వ్యాపకం ఏర్పరుచుకోండి... బ్రతికేందుకు అవసరమైన డబ్బు సంపాదించుకోండి!'' అంటూ.



చయనులు మాట్లాడలేదు. అతగాడికి గాయత్రి అంటే అభిమానం కాదు, ఒక రకం భయం కూడా – ఆమె చదువుకుందని, తెలివిగలదని...

వయస్సు–వ్యసనాలు, వ్యాపకాలూ ఆ సుడిగుండంలో పడ్డ చయనులూ చేయదగ్గ ఉద్యోగం, సద్యోగం – ఏవీ కంటికి కనబడలేదు. దోషిలా భార్య ముందు దేబిరించుకు నిలబడటం నచ్చలేదు. భార్య కొంగు నడుంకి బిగించి, ఆస్తిపాస్తులు చేజిక్కించుకుని, కర్రపెత్తనం చెలాయిస్తే, పరువు పబ్లీకుగా ముండ మోస్తుందనీ తెలుసు.

అన్నీఆలోచించుకుని, చయనులు, ''నీ ఇష్టం... ఏం చేసినా సరే! కాదనను'' అన్నాడు.

గాయిత్రి ఇంతకాలం ఇంట్లోనేవుండి ఎంతో తాపత్రయ పడింది పరువు కోసం. ఇప్పుడు సంసారం నిలబెట్టుకోకపోతే, ఆస్తి, కుటుంబ గౌరవం, పరపతి పోతాయని గ్రహించి, సలహాకోసం గవండ్ల దుర్గమ్మను సంప్రదించింది.

గవండ్ల దుర్గమ్మ అనాదిగా ఆ ఇంట్లో ఓ రకంగా పనిమనిషి, మరో రకంగా పెత్తందారు. దుర్గమ్మకు ఆ ఇంట్లో ఎదురు లేదు.

తెల్లవారుజామున వచ్చి ఇల్లు ఊడవటం, గిన్నెలు, చెంబులు, బిందెలు తోమటం, నీళ్లు తోడి పొయ్యడం, బియ్యం, పప్పులు బాగు చేయడం, కూరలు తరగడం, గుడ్డలుతకడం – ఇలా అన్ని పనులూ చేసి, ఆ దొడ్లోనే స్నానం చేసి, ఉతికిన గుడ్డలు కట్టుకుని, నుదుట అరకాసంత కుంకుమ పెట్టుకుని, వంటయిందాక ఉండి, ఇంటివాళ్ళ భోజనాలయిం తరువాత, తనూ తిని, ''నాన్నగారూ! నే వెడుతున్నా – అమ్మా! మళ్లీ సాయంత్రం వస్తా. ఇల్లు జాగ్రత్త'' అని చెప్పి వెడుతుంది. ఇది చయనులు పుట్టకు ముందు నుంచి ఆమెకు ఆ ఇంటితో వున్న అనుబంధం.

కులం వేరైనా, ఆమెకు ఆ ఇంటి సంప్రదాయం తెలుసు. మనుషులు, వాళ్ల ప్రవర్తన తెలుసు.

అందుకే, ''మరదలా! ఇక వెనకాముందు చూడకు. మీ ఆయన్ను తీసుకు పట్నంవెళ్లు, అక్కడ ఏఉద్యోగమో, సద్యోగమో చూసుకోండి. ఇక్కడుంటే, నీ మొగుడు మాటవినడు. చేతికందడు. మీ అయ్యవార్లు పనీ, పాటలేక తిని కూర్చుని, ఆస్తులమ్ముకుని, ఆసాంతానికి అడుక్కుంటున్నారు. నువ్వూ అలా కాకు'' అని దుర్గమ్మ సలహా ఇచ్చింది.

గాయత్రి, మరో అడుగు ముందుకువేసి, కౌలు సరిగ్గా రాని పొలం, దొడ్లు అమ్మేసింది. ఉంటున్న పది గదుల మండువా ఇంటిని, దాని



వెనుక దొడ్డిని, ఊరుబయట మామిడితోటను అలాగే ఉంచమని, వాటి విలువ తెలిసిన దుర్గమ్మ చెప్పటంతో, వాటిజోలికి వెళ్లకుండా ఊరుకుంది.

"ఉన్న ఊరు కనుక ఇల్లుండాలి. అదీగాక ఇంత పెద్దిల్లు ఎవ్వడూ కొనడు. ఇల్లంతా రంగూన్ కలపతో కట్టింది. నల్లచేవతో చేసిన ద్వారబంధం తలుపులు, కిటికీలు చాలావిలువైనవి. అలాగే ఉండనీయండి. మామిడి తోట బంగారు గని... అమ్మొద్దు... ఎప్పటికైనా ధర వస్తుంది!"

గాయత్రికి ఆమె సలహా నచ్చింది.

ఇక మిగిలింది శాస్త్రి, ఆయన భార్య.

"వాళ్లిష్టం – ఇక్కడుంటే నే చూస్తా... మీతో వస్తే తీసుకుపోండి" అంది దుర్గమ్మ.

శాస్త్రి అవుననలేదు, కాదనలేదు.

చయనులు ఆఖరి క్షణంలో ఊరు వదలనని మొరాయించాడు.

అదుగో అప్పుడు దుర్గమ్మ వచ్చి, "చయనులూ నేన్నీకేమవుతా?" అని నిలదీసింది.

ఆరడుగుల విగ్రహం. నుదుట చాదుబొట్టు, చెవులకి వెండి కమ్ములు, మెళ్ళో వెండి నానుతాడు. మోకాళ్ల పైకి కట్టిన వంగపండు రంగు చీర, జాకెట్టు ఎరుగని వక్షస్థలంపై కప్పుకున్న కొంగు. నడుముకు చేతులానించుకున్న దుర్గమ్మ – అపరకాళిలా కన్పడ్డది ఆ క్షణాన చయనులికి.

"చయనులూ – నిన్ను ఈచేతుల్లో ఎత్తుకున్నా, పెంచా...కన్నది ఆయమ్మయినా నువ్వు నే పెంచిన బిడ్డవి. మర్యాదగా, పెళ్ళాం చెప్పింది విను. మొరాయించావో, నా సంగతి తెలుసుగా గొడ్డును బాదినట్లు బాదుతా – వెళ్ళి బాగుపడు" అని దుర్గమ్మ గదమాయించింది.

చయనలుకు తెల్సు – దుర్గమ్మ అన్నంత పని చేస్తుందని.

అలా చయనులు – ఊరదాలాడు.

అది నిగమం..

***

కొన్ని ఏళ్లు గడిచాయి – గడుస్తున్నాయి....

విశ్వేశ్వరశాస్త్రి ఓ రాత్రి నిద్రలో కన్ను మూశాడు. అది తెలుసుకున్న ఆయన భార్య – కుప్పకూలిపోయింది దుర్గమ్మ ఒడిలో.

చయనులికి కబురంపితే వచ్చాడు. గాయత్రి వచ్చింది.

శాస్త్రి దంపతులను ఊరేగించి, ఊరి చివరగల వారి మామిడితోటలో దహనం చేయించి – సమాధులు కట్టించింది – అన్నీ తానే అయి, దుర్గమ్మ.

"మరదలా! ఆ తోట, ఆ ఇల్లు నావి!" అంది దుర్గమ్మ దృఢంగా.

గాయిత్రి నోరు తెరుచుకు ఆమెనే చూస్తుంటే, చయనులు తలొంచుకుని ఓ పక్కగా నిలబడ్డాడు.

"మీరెళ్ళండి... మీ బ్రతుకు మీరుబ్రతకండి... ఏనాడైనా పుట్టిన ఊరు గుర్తొస్తే, ఇంటి ఆడబడుచు అవసరం కలిగితే రాండి!" అంది దుర్గమ్మ.

చయనులూ, గాయత్రీ వెళ్ళిపోయారు అయిష్టంగానే.

ఊరు – కృష్ణానది వొడ్డునే ఈ చివరనుంచి ఆ చివరకు ఉంటే, ఓ చివర వేణుగోపాలస్వామి గుడి – మరో చివర దుర్గమ్మ ఇల్లు. రోజూ దుర్గమ్మ అంత దూరమూ వచ్చి గుడి ఆవరణ బాగుచేసి తర్వాత పక్కనే వున్న చయనులు ఇల్లు శుభ్రం చేసి, దొడ్లో తులసి కోటలో ఓ చెంబెడు నీళ్లు పోసి దీపారాధన చేసి, వెళ్లటం ఆమె నిత్యకృత్యంగా చేసుకున్నది.

అప్పనంగా దబాయించి, నోరులేని చయనులు ఆస్తి, హస్తగతం చేసుకున్నదని – ఊరి జనం అనుకున్నారు. దుర్గమ్మ నోటికి దడిసి ఎవ్వరూ, పైకి అనకపోయినా అంతరంగంలోనూ, నలుగురిలో గుసగుసగానూ, అనుకుంటూనే ఉన్నారు.

దుర్గమ్మ కొడుకు ప్రయోజకుడై ఊళ్లో కల్లు దుకాణంతో పాటు పక్కనే బ్రాంది షాపు నడుపుతున్నాడు. ఆ పనిమీదే తరచు పట్నం వెళ్ళి వస్తుంటాడు.

ఒకసారి అలా వెళ్ళి ఇంట్లోకి వస్తూనే, తల్లితో చెప్పాడు, "చయనులు" తరువాత మాట చెప్పటానికి నోరు రాలేదు చాలాసేపు అతడికి, నంగి నంగిగా ఏదో గొణగసాగాడు.

అతడు చెప్పింది ఆమెకు అర్థమయ్యేటప్పటికి గుండెల్లో బాధను ఆపుకోలేక పోయింది దుర్గమ్మ.

"నిజమా...?" అన్నది జీరబోయిన గొంతుకతో, నమ్మలేనట్లుగా.

"నిజం! బస్టాండ్‌లో నెత్తిన ముసుగేసుకుని – మా ఆవిడ జబ్బు మనిషి, పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు... నేను పనిచేయలేను, క్యాన్సరు... ఎన్నాళ్ళుంటానో తెలియదు... ధర్మం చేయండి – అంటూ అడుక్కుంటున్నారు..."

"చయనులేనా?"

"ఎంత నీరసించిపోయినా నేను గుర్తు పట్టగలిగాను.. ఖచ్చితంగా చయనులే!"

ఆ క్షణానే దుర్గమ్మ బయలుదేరింది కొడుకుని వెంటబెట్టుకుని, నానా యాతనలు పడి, వాళ్లనూ, వీళ్లనూ అడిగి – ఇల్లు కనుక్కుంది.

ఎప్పుడూ తనింటికి రాని దుర్గమ్మ రావటం చూస్తూనే విస్తుపోయిన గాయత్రి, ఆమె చెప్పినదంతా విని తలవంచుకున్నది.

"వాడినలా వదిలేశావా... ఎంతయినా నీ భర్త కాదా!"

"భర్తే!.... ఎన్నోవిధాల ప్రయత్నించా... నచ్చచెప్పా... బ్రతిమలాడా... భంగపడ్డా... ఉహూ! ఇంట్లో ఉన్నంతసేపు తలెత్తడు. బయటపడితే మన చేతికందడు. వారాలు, రోజులు.... ఎప్పుడొస్తాడో తెలియదు... నేను మాత్రం ఎంతకాలం భరించేది. నాకూ బాధ్యతలున్నాయి... పిల్ల పదో క్లాసు... పిల్లాడు... ఏడు... స్కూల్లో పనిచేయాలి... బ్రతకాలి... వీళ్ళని బ్రతికించాలి!" అంది గాయత్రి.

దుర్గమ్మ, ఆమె కొడుకూ రెండ్రోజులు తిరిగి తిరిగి, వెతికి చయనులను పట్టుకున్నారు. ఓ గుడి అరుగు మీద కూర్చుని వున్న అతను వీళ్లను చూస్తూనే కలవరపడుతూ మొహం పక్కకు తిప్పుకున్నాడు.

"చయనులు నేన్నీకేమవుతా?"

చయనులు మాట్లాడలేదు.

"మీ ముత్తాత ఈ పరగణాలోనేకాక దేశంలోనే పేరెన్నికగన్న వేద వేదాంగ పండితుడట... మీ తాత నిగమాగమాల్లో దిట్ట. ఎన్నో గుళ్లు గోపురాలు కట్టించి, ధ్వజస్తంభాలు వేయించి పునీతుడైనాడు. మీ నాన్న శ్రోత్రియ బ్రాహ్మడు. నీవో భ్రష్టుడివి... స్నానం లేదు.. సంధ్యలేదు. జపం లేదు. ఆఖరికి కన్నవాళ్లకు తద్దినం, తర్పణం కూడా వదలని కులహీనుడివి. మీ కులం మీద గౌరవం పోవటానికీ, నీలాంటి వాళ్లే కారణం... ఇదేం ఖర్మరా. భార్య వుండి పరువుగా బ్రతుకుతోంది. పిల్లలున్నారు. వాళ్ల బాగోగులు చూడకపోతే పోయినావ్, వాళ్ళ భవిష్యత్తుకు అడ్డం రాకురా. నీలాంటి భ్రష్టుడి పిల్లలంటే వాళ్ళకెంత అగౌరవమో ఆలోచించు... నేను నీ తోడ బుట్టినదాన్ని, నీ కులందాన్ని కాదు. కానీ మీ ఇంట పెరిగా, మీ ఉప్పు తిన్నారా... మనూరు రా... నీ ఇల్లుంది, మామిడి తోట వుంది... హాయిగా బ్రతుకు" అని చెప్పింది. "అంతేగాదు – చయనులూ... రేపు తెల్లారేసరికి నువ్వు మనూరు రాకపోతే, నా శవం కృష్ణలో తేలుతుంది" అని కూడా భయపెట్టింది.

దుర్గమ్మ... వస్తూ వస్తు గాయత్రిని కల్సి, "మరదలా, నీ మామాడితోట ఫలసాయం బ్యాంకులో వేయిస్తున్నా... నీ పిల్లల చదువుకు, పెళ్ళిళ్ళకు అక్కరకొస్తుంది. ఇల్లు – పోస్టాఫీసుకు, ఆరోగ్యకేంద్రానికి అద్దెకిచ్చా. ఆ డబ్బు వుంది. నీకేం భయం లేదు – దిగులు పడకు – నే ఉన్నా!" అని చెప్పి వచ్చేసింది.

ఇన్ని చెప్పిందిగాని అసలు రహస్యం చెప్పలేకపోయింది – చయనుల్ని శాంతమ్మ కని సంవత్సరం పాటు అనారోగ్యంతో మంచం పడితే, ఆ పాపడికి తన కొడుకుతో సమంగా పాలిచ్చి తనే పెంచిందని... వాడు అంతగా భ్రష్టుడవ్వటానికి తన పాలే కారణమనే మాట ఎక్కడొస్తుం దోననే దిగులుతో, ఆ కుటుంబం సర్వనాశనమవ్వకుండా ఆ ఆస్తి విషయంలో కఠినమైన కట్టడి చేసిందనీను...

ఇది నిగమాగమం...

తెల్లవారింది. కృష్ణలో స్నానం చేసి సూర్యుడికి అర్ఘ్యం విడుస్తూ – చయనులు – మెట్ల దగ్గర ఉన్నాడు... గవండ్ల దుర్గాంబ ఎప్పుడొస్తే అప్పుడు సాష్టాంగదండ ప్రమాణం చేద్దామని!

❑

## ఆత్మీయతా అనుబంధం ముఖ్యం



తెలుగు కథకు 'నవ్య' అందిస్తున్న, ప్రోత్సాహం పాఠకుల అనూహ్య ఆదరాభిమానాలకు ధన్యవాదాలు. సర్వదా కృతజ్ఞతలు.

'నిగమాగమం' కథకు ప్రోత్సాహక బహుమతికి ఎంపికచేసిన, సంపాదక మండలి సభ్యులకు కృతజ్ఞతలు.

వ్యక్తి సమాజం బాగుండాలంటే ఆత్మీయత అనుబంధం ముఖ్యం. ఈ బంధం కులాలకు ఆర్థిక అసమానతలకు అతీతంగా ఉండాలి. నిస్వార్థంగా ఇతరుల మంచి కోరాలి. మార్గనిర్దేశకత్వం జరగాలి. అదే 'నిగమాగం'లో చెప్పాలని ప్రయత్నించా. ఈ కథకు స్ఫూర్తి సమాజం లోని వ్యక్తులు సంఘటనలే!

–ఎస్.తారకరామారావు
040-23833878